క్లుప్తంగా

తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బుల్లికృష్ణవేణి

కరప: తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునేందుకు యంగ్‌మైండ్స్ సేవాసంస్థ తలపెట్టిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, సీఆర్పీలతో కల్సి రక్తదాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ఉపాధ్యాయులు, కార్యాలయం సిబ్బంది స్పందించి రక్తదానం చేయాలన్నారు. సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న కాకినాడ గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సీఆర్పీలు పి.రాజు, పి.సత్యనారాయణ, లక్ష్మి, సుజాత, చంద్రకళ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు గుర్తుగా స్మారక దినోత్సవం



స్మారక దినోత్సవాలను ప్రారంభిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట ప్రసాద్

బోట్‌క్లబ్: దేశ విభజన సమయంలో 5 లక్షల మంది మరణించారని వారి త్యాగాలను గుర్తిస్తూ స్మారక దినోత్సవం జరుపుకొంటున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట ప్రసాద్ అన్నారు. స్థానిక తిలక్‌వీధిలోని యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న విభజన భయానక స్మారక దినోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారక దినోత్సవ ఫోటో ప్రదర్శనను బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తాతారావు, బ్యాంకు మేనేజర్ దేవరాజు, అసోసియేషన్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

42 మందికి కంటి పరీక్షలు

కరప: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో మంగళవారం క్రిస్టియన్ మెడికల్ సెంటర్ (సీఎంసీ హాస్పటల్, పిఠాపురం) ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 42 మందికి పరీక్షలు చేసి 12 మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని గుర్తించి, వారికి పిఠాపురంలోని ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఏఎన్‌ఎం విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: స్థానిక టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి పాటోలు చిన్నపున్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నామని, సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో మెరుగైన ర్యాంకుకు కృషి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్-24)లో జేఎన్‌టీయూకే 101–150 ర్యాంక్ సాధించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 2023లో ఇదే ర్యాంక్ వచ్చిందని, వచ్చే ఏడాది 50–100 ర్యాంకింగ్ వచ్చేలా కృషిచేస్తామన్నారు. రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తి స్థాయి రీసెర్చ్ స్కాలర్‌తో పాటు, విదేశీ విద్యార్థుల ప్రవేశాలను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య ప్రోత్సాహంతో పాటు ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియో పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనం ఢీకొని దేవాలయం గోడ ధ్వంసం

కాకినాడ క్రైం: డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఓ వాహనం దేవాలయాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గుడి గోడ భాగం ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోర్ వీలర్ వాహనాన్ని నడుపుతూ కాకినాడలోని రామారావుపేటలో సుబ్బయ్య హోటల్ సమీపంలో ఉన్న వినాయకుడి గుడిని ఢీకొట్టి పరారయ్యాడు. మంగళవారం ఉదయాన్నే స్థానికులు గమనించారు. వారిలో ఒకరైన పూసర్ల సత్యనారాయణ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీఐ నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దేవాలయాన్ని ఢీకొట్టింది ఏపీ 39 యూసీ 2771 నంబరుగల టాటా మేజిక్ వాహనంగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన చోదకుడు కాకినాడకు చెందిన విజయదుర్గా ప్రసాద్‌గా నిర్ధారించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు.

నిధుల నిర్వహణలో బాధ్యత ఏదీ?

- సీఎస్సార్ నిధులు రూ.5 కోట్లపై అశ్రద్ధ
- జేఎన్‌టీయూకేలో 15 ఏళ్లుగా నిర్లక్ష్యం
- కొత్తగా ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన గ్రీన్‌కో ఆర్కిటెక్ట్ టీమ్ (ఫైల్)

బాలాజీచెరువు: కళాశాల నుంచి వర్సిటీ స్థాయికి ఎదిగి నగర నడిమధ్యలో దాదాపు వంద ఎకరాలకు పైబడి ఉన్న జేఎన్‌టీయూకేలో గత ఏడాది ఆగస్టులో సరికొత్త ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయి. కళాశాల నుంచి వర్సిటీగా అప్‌గ్రేడ్ అయి విశాలమైన స్థలంతో దానికి తగిన వనరులు అందుబాటులో ఉన్న నాడు నిర్లక్ష్యం చేశారు. వర్సిటీ ఏర్పడిన 15 ఏళ్ల కాలంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఐటీసీఎల్, ఓఎన్‌జీసీ వంటివి కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ నిధులు కేటాయిస్తామన్నా దీనిపై దృష్టి పెట్టినవారు లేరు. కళాశాల, చిన్నచిన్న దాతల సహాయంతో మియావాకి ఫారెస్ట్, నక్షత్ర వనం, జంగిల్ రీడింగ్‌బుక్ వంటి పర్యావరణ ప్రాజెక్టులకు ఆ నిధులు జోడించి మరింత గ్రీనరీగా తయారుచేయడానికి ప్రణాళికలు రూపొందిచారు. గత ఏడాది స్నాతకోత్సవానికి వచ్చిన గ్రీన్‌కో వ్యవస్థాపకుడు చలమలశెట్టి అనిల్‌కు అప్పటి వీసీ డాక్టర్ ప్రసాదరాజు దీనిపై ప్రతిపాదించగా వారికి ఉన్న జెన్‌కో సంస్థ ద్వారా సునీల్ చారిట్రబుల్ ట్రస్ట్‌చే వర్సిటీలు పలు మౌలిక వసతుల నిమిత్తం రూ.5 కోట్ల మంజూరుకు అంగీకరించారు.

చేపట్టే పనులు ఇవే..

ఈ నిధులతో వర్సిటీలో భారీ వృక్షాల చుట్టూ ప్లాట్‌ఫార్మ్, రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్ లైటింగ్స్, ఓపెన్ థియేటర్, పార్కు, ఆర్నమెంట్ ట్రీస్, 2 వాటర్ బాడీస్, యోగా సెంటర్, ఓపెన్ జిమ్, వంటివి ఏర్పాటు చేసి నగరంలో సుందరమైన స్ఫూర్తిదాయక ప్రాంతంగా రూపొందించడానికి ప్రణాళికలు రూపొందించారు. దీనికి సంబంధించి ఇంజినీరింగ్, వర్సిటీ అధికారులు జెన్‌కో ఆర్కిటెక్ట్ టీమ్ ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. పనులు ప్రారంభమై మూడు దశల్లో 2024 ఏప్రిల్‌కు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిచారు. రెండేళ్ల పాటు వారే ఉచితంగా నిర్వహణ చేపట్టేలా ట్రస్ట్‌కు బాధ్యతలు అప్పగించారు.

ట్రస్ట్ సభ్యులను సంప్రదించాం..



వర్సిటీలో పర్యావరణాన్ని పెంపొందించి గ్రీన్ క్యాంపస్‌గా తయారుచేయాలనే ఆలోచన నాకు చాలా దృఢంగా ఉంది. గత ఏడాది సునీల్ ట్రస్ట్ ద్వారా గ్రీన్‌కో సంస్థ రూ.5 కోట్లు కేటాయించారు. వీసీ చాంబర్‌తో పాటు కొన్ని చోట్ల మొక్కలు ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అంగీకరించిన నిధులు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి వర్సిటీలో గ్రీనరీ ఏర్పాటు చేస్తాము.

– డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జ్ వీసీ, జేఎన్‌టీయూకే

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి రెండురోజులు, మరొకరికి మూడు రోజులు, మరొకరికి నాలుగు రోజులు జైలు శిక్ష, ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి రెండురోజుల జైలు శిక్ష, 8 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్, తాళ్లరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్, పెద్దపూడి పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జగన్ చిత్రం తొలగింపు అప్రజాస్వామికం



పైలాన్‌పై జగన్ చిత్రాన్ని తొలగించడాన్ని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: గ్రామస్వరాజ్యం లక్ష్యంగా 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ స్మారకంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ పైలాన్ పైభాగంలో నవరత్నాల చక్రం లోగోలో జగన్, దివంగతనేత వైఎస్సార్ ముఖచిత్రాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించేందుకు మండల జనసేన పార్టీ నాయకులు కుట్ర పూరితంగా పైలాన్‌పై లోగోను తొలగించి, నాలుగు సింహాల బొమ్మను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్య అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం జగన్ చిత్రం తొలగింపు శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు స్పందించి కరపలో సమావేశమై జనసేన నాయకులు చేస్తున్న కుట్రపూరిత చర్యలను ఖండించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పక్కనే ఉండే స్త్రీశక్తి భవన ఆవరణలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 2019లో జనవరి 19న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్వాక్రా బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన మీటింగ్ హాలుకు చంద్రన్న సమావేశ మందిరంగా పేరుపెట్టారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విజ్ఞతతో ఆలోచించి, వాటి జోలికి వెళ్లలేదన్నారు. పార్టీలను పక్కనపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జేఎస్పీ నాయకులు కక్షపూరిత చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జేఎస్పీ నాయకులు కూరాడ సచివాలయం భవనంపై ఉండే మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు చిత్రాలను తొలగించారని, పెనుగుదురు గ్రామ సచివాలయలంలో మీటింగ్ హాల్‌కు కన్నబాబు సమావేశ మందిరం అని పేరు పెడితే దానిని తొలగించారని, ఇప్పుడు కరపలో పైలాన్‌పై జగన్ చిత్రాన్ని తొలగించారన్నారు. ఇప్పటికైనా ఆ నాయకులు శిలా ఫలకాలు, ముఖచిత్రాలు కూలకొట్టడం మానుకోవాలన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, నక్కా బాబులు, అనసూరి శ్రీనివాసరావు, చింతా బుజ్జి, పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ తీగల తొలగింపు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని రాయుడుపాలెంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలను విద్యుత్ అధికారులు తొలగించారు. జూలై 27న సాక్షిలో నిర్లక్ష్యంతో వ్యవహరించి.. శీర్షికన యమపాశాల్లా విద్యుత్ తీగలు, చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ల విషయమై ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో రాయుడుపాలెం జంక్షన్ సమీపంలో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలతో పాటు, పక్కనే ప్రమాదభరితంగా ఉన్న ఐరన్ మెట్లను నోటీసు లిచ్చి తొలగించినట్టు లైన్‌మన్ బొజ్జా వాసు తెలిపారు.



రాయుడుపాలెం వద్ద ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు (ముందు)



సాక్షి కథనంతో మెట్లను తొలగించి, సరిచేసిన విద్యుత్ తీగలు

సాక్షి ఇంపాక్ట్

గొయ్యిని పూడ్చిన కార్పొరేషన్



స్టేడియం రోడ్డులో పూడ్చిన భారీ గొయ్యి

ఈ నెల 9వ తేదీన కాకినాడ సిటి పేజీలో ప్రయాణం బిక్కుబిక్కు.. వాహన చోదకులకు తప్పని తిప్పలు అనే వార్తకు స్పందించిన కార్పొరేషన్ అధికారులు నాగమల్లితోట జంక్షన్ నుంచి స్టేడియానికి వెళ్లే రోడ్డులోని పెద్ద గొయ్యిని పూడ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ)

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి

- 13 ఏళ్లుగా వసతులు లేక అవస్థలు
- పూర్వ పంచాయతీల విలీనంపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వాకలపూడి మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: పంచాయతీకి 13 ఏళ్లగా ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమని వాకలపూడి మాజీ సర్పంచ్ గింజాల శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ రాజ్ పాలన నుంచి ప్రభుత్వ గెజిట్ ద్వారా వేరైన కాకినాడ అర్బన్ ఏరియా పూర్వ పంచాయతీల విలీనంపై పంచాయతీ మాజీ సర్పంచ్‌లు సభ్యులు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చా వేదిక నిర్వహించారు. జన్మభూమి పార్కు వద్ద బలగం ఎస్టేట్ మీటింగ్ హాలులో మంగళవారం ఉదయం శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు పాల్గొన్నారు. 13 ఏళ్లగా పంచాయితీ ఎన్నికలు లేకుండా కార్పొరేషన్ లో విలీనం పూర్తి కాకుండా నడి సంద్రంలో నావలాగా అర్బన్ ఏరియాల్లో పౌర సౌకర్యాలు లేవన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కోల్పోయి 73, 74 రాజ్యాంగ సవరణ ఫలితాలు లేకుండా అన్ని విధాలుగా నానా అవస్థలు పడుతున్నారన్నారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్‌ను కలిసి విలీనం విషయంలో సాంకేతిక అడ్డంకులు గురించి చర్చించాలని ప్రభుత్వ చర్యలను కోరాలని నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రూరల్ ఎమ్మెల్యే పంతం వేంకటేశ్వరరావును కాకినాడలో విలీన గ్రామాల ఐక్య వేదిక బృందం కలిసి నివేదిక ఇవ్వాలని తీర్మానించారు. కాకినాడలో విలీన గ్రామాల ఐక్యవేదిక సమన్వయకర్తగా ఇంద్రపాలెం మాజీ సర్పంచ్ పలివెల వీరబాబుకు బాధ్యతలు స్వీకరించారు. సమావేశంలో అడ్డూరి ఫణీష్, బలగం ప్రసన్న కుమార్, పితాని అప్పన్న, సలాది శ్రీనివాసబాబు, మండా సింహాద్రిరావు, కముజు నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నర్సులకు ఆదర్శం నైటింగేల్

కాకినాడ: నర్సులకు నైటింగేల్ ఆదర్శనీయురాని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ వర్ధంతి నిర్వహించారు. ధనిక కుటుంబంలో పుట్టిన నైటింగేల్ యుద్ధ సమయంలో గాయాల పాలైన సైనికులకు ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. సొంత డబ్బులతో మందులు, వైద్య పరికరాలను ఆమె సమకూర్చారన్నారు. 1910 ఆగస్టు 13న లండన్‌లో ఆమె మరణించారని శ్రీ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీతో అదనపు ఆదాయం



కరపలో వర్మీ కంపోస్టు తయారీని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు వివరిస్తున్న అధికారులు

కరప: గ్రామాల పరిశుభ్రతతో పాటు, సేకరించిన తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓ పీఆర్డీ బీఏ సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా రెండోరోజు మంగళవారం డంపింగ్ యార్డుల నిర్వహణ, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ గురించి వివరించి, ఎంపీడీఓ, ఈఓ పీఆర్డీలు అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శులు వి.సునీల్‌కుమార్, వై.రాంజీ హీరాలాల్ తడి, పొడి చెత్త ఎలాసేకరించాలి, డంపింగ్ యార్డు నిర్వహణ, సేకరించిన చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కరపలోని డంపింగ్ యార్డుకు సర్పంచ్‌లను, కార్యదర్శులు, క్లాప్ మిత్రలను తీసుకు వెళ్లి వర్మీ కంపోస్టు తయారీని చూపించి అవగాహన కల్పించారు.

ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ఎగురవేయాలి



డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

బోట్‌క్లబ్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా కృష్ణమోహన్ అన్నారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లో 200 మంది విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మహిళామోర్చా నాయకులు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, నాయకులు మాలకొండయ్య, ఉదయభానోజీరావు పాల్గొన్నారు. స్థానిక గాంధీనగర్ 41 డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా నిర్వహించారు. స్వాతంత్య్ర విలువలను నేటి యువతకు తెలియ చెప్పడం, వారిలో దేశభక్తి దృఢపరచటం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో డివిజనకు 50 ఇళ్ల మీద జాతీయ పతాక ఆవిష్కరణ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ, బీజేపీ నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం, గోడి వెంకట్ పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తిని చాటాలని బిజెపి కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో రంభాల ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు మంగళవారం కాకినాడ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ర్యాలీని డీఎస్‌ఏ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎస్‌ఏ ప్రాంగణం నుంచి జేఎన్‌యూకే క్రీడామైదానం రోడ్డు మార్గాన నాగమల్లితోట జంక్షన్‌కు తిరిగి డీఎస్‌ఏ ప్రాంగణానికి చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు భారత్‌మాతకీ జై, వందే మాతరం అనే నినాదాలతో ఆజాదీ కా అమృత మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో డీఎస్‌ఏ శిక్షకులు వి.సతీష్ కుమార్, ఎన్.సురేష్, రుద్ర, ఎండీ అలీషా, యూత్ సర్వీసెస్ జూనియర్ అసిస్టెంట్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

నిగ్రహంతో భవిత బంగారం

- చీకటి తప్పులతో జీవితం అంధకారం
- హెచ్‌ఐవీతో అప్రమత్తంగా ఉండాలి
- 'మీకు తెలుసా' కార్యక్రమంలో చేంజెస్ ప్రోగ్రాం మేనేజర్ దుర్గా భవాని



సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ దుర్గా భవాని

కాకినాడ క్రైం: క్షణికావేశంలో చేసే చీకటి తప్పుల వల్ల ఎన్నో జీవితాలు అంధకారం అవుతున్నాయని ప్రభుత్వ అనుబంధ సంస్థ చేంజెస్ ప్రోగ్రాం మేనేజర్ దుర్గా భవాని అన్నారు. హెచ్‌ఐవీ బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, పడుపు వృత్తిలో మగ్గిపోతున్న మహిళల సంరక్షణ కోసం పనిచేస్తున్న ఈ సంస్థ మంగళవారం కాకినాడలోని రాజీవ్‌గాంధీ ఎంబీఏ కళాశాలలో హెచ్‌ఐవీపై యువతలో అవగాహన కల్పించేందుకు 'మీకు తెలుసా' పేరుతో సదస్సును నిర్వహించింది. జిల్లాలో ఎయిడ్స్ కేసులు గణనీయంగా తగ్గాయని, ఇదే ఒరవడి కొనసాగించి హెచ్‌ఐవీ రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దాలని భవాని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ పుష్పకుమారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, చేంజెస్ సంయుక్తంగా ఎందరో ట్రాన్స్‌జెండర్లు, సామాన్యులు, పడుపు వృత్తిలో కొనసాగుతూ హెచ్‌ఐవీ బారిన పడిన బాధితులకు అండగా నిలిచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచామన్నారు. వీరందరికీ నిత్యం హెచ్‌ఐవీ పరీక్షలు జరిపి బాధితులకు సకాలంలో మందులు అందిస్తున్నామన్నారు. విద్యార్థి దశలోనే నిగ్రహ శక్తిని అలవరుచుకోవడం ద్వారా భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. లైంగిక విజ్ఞానాన్ని ఓ శాస్త్రంగా పరిగణించి అభ్యసించాలనీ, ఇందులో ఎటువంటి అసభ్యతకు తావులేదన్నారు. తద్వారా లైంగిక సంక్రమణ వ్యాధులపై పూర్తి అవగాహన పెంపొంది వాటి బారిన పడకుండా జీవితాలను కాపాడుకోవచ్చని సూచించారు. అనుమానం ఉన్నవారు స్థానిక ఆరోగ్య కేంద్రాలలో ఉచిత హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకుని పూర్తి ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాక్స్) తరఫున క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శైలజ, డీపీసీ బుజ్జిబాబు హాజరయ్యారు. వారు మాటాడుతూ హెచ్‌ఐవీ నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా చేంజెస్ ఆధ్వర్యంలో విద్యాలయాలు, సచివాలయాల పరిధిలో యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు, హెచ్‌ఓడీ శశికిరణ్, చేంజెస్ సభ్యులతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవదానంపై దృష్టి సారించాలి



అవయవ దానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: అవయవ దానంపై ప్రతి పౌరుడు దృష్టి సారించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ కోరారు. స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో మంగళవారం ఐడీఏ, ఐఎంఏల ఆధ్వర్యంలో అవయవ దాన దినోత్సవం నిర్వహించారు. డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల మాట్లాడుతూ మరణించిన దాత కుటుంబానికి అవయవాలు, కణజాలాలను దానం చేయడానికి ఎటువంటి ఖర్చు ఉండదని అవయవ దానానికి సంబంధించిన అన్ని ఖర్చులు లబ్ధిదారుల బీమా పరిధిలోకి వస్తాయన్నారు. అందువల్ల, ఒకరి జీవితంలో ఒక ఆశాకిరణాన్ని తీసుకురావడానికి అవయవాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేయాలన్నారు. కార్యక్రమంలో రేడియాలజిస్ట్ భాస్కర్, వెంకన్న బాబు, ప్రజలు పాల్గొన్నారు.

మరొకరికి జీవితం..

కాకినాడరూరల్: స్థానిక రమణయ్యపేటలో ఐడీఏ ఆధ్వర్యంలో అవయవదాన దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ లీ హెరిక్ మొదటి అవయవ దాత అని 23 డిసెంబరు 1954న తన కవల సోదరుడు రిచర్డ్‌కు మూత్రపిండాన్ని విరాళంగా ఇచ్చాడన్నారు. డాక్టర్ జోసెఫ్ ముర్రె విజయవంతంగా మార్పిడి చేసిన తర్వాత, అతను చేసిన కృషికి 1990లో ఫిజియాలజీ, మెడిసిన్‌లో నోబెల్ బహుమతిని అందుకున్నారన్నారు. అవయవ దానం వలన అవసరమైన వారికి జీవితాన్ని బహుమతిగా ఇవ్వడానికి ఒక లోతైన మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.